నలుగురికి కీర్తి చక్ర

- మరణానంతరం ముగ్గురికి
- 18 మందికి శౌర్య చక్ర
- ఆమోదం తెలిపిన రాష్ట్రపతి

మన్‌ప్రీత్

హుమయున్

న్యూఢిల్లీ, ఆగస్టు 14: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సాయుధ బలగాలు, కేంద్ర సాయుధ పోలీసు బలగాలకు చెందిన 103 మందికి శౌర్య పురస్కారాలు లభించాయి. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం ఆమోదం తెలిపారు. ఇందులో నాలుగు కీర్తి చక్ర, 18 శౌర్య చక్ర పురస్కారాలు కాగా, 63 సేనా పతకాలు(శౌర్య), 11 నౌ సేనా పతకాలు, ఆరు వాయు సేనా పతకాలు ఉన్నాయి. మరణానంతరం ముగ్గురికి కీర్తి చక్ర పురస్కారాలు, నలుగురికి శౌర్య చక్ర దక్కనున్నాయి. సైనిక ఆపరేషన్‌లలో విశేష సేవలు అందించినందుకు గానూ 39 మెన్షన్ ఇన్ డిస్పాచ్‌లకు సైతం రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. ఇందులో మరణించిన సైనిక జాగిలం కెంత్ కూడా ఉంది. పతకాలు, పురస్కారాల స్థాయి కానప్పటికీ ప్రదర్శించిన శౌర్య ప్రతాపాలకు మెన్షన్ ఇన్ డిస్పాచ్ అనే గుర్తింపును ఇస్తారు. కాగా, శౌర్య పురస్కారాల్లో ఎక్కువగా సీఆర్పీఎఫ్ సిబ్బందికే దక్కాయి. సీఆర్పీఎఫ్‌కు సేవలందించిన 52 మంది శౌర్య పురస్కారాలకు ఎంపికయ్యారు.

కీర్తిచక్రధారులు వీరే

శాంతి సమయంలో ఇచ్చే రెండో అత్యున్నత శౌర్య పురస్కారమైన కీర్తి చక్రకు ఆర్మీకి సేవలు అందించిన నలుగురు ఎంపికయ్యారు. రాష్ట్రీయ రైఫిల్స్ 19వ బెటాలియన్‌కు చెందిన కర్నల్ మన్‌ప్రీత్ సింగ్(మరణానంతరం), 56వ బెటాలియన్‌కు చెందిన మేజర్ మల్ల రామగోపాల్ నాయుడు, 63వ బెటాలియన్‌కు చెందిన రైఫిల్‌మ్యాన్ రవికుమార్(మరణానంతరం), జమ్ము కశ్మీర్ పోలీసు శాఖలో డీసీపీగా పని చేసిన హుమయున్ ముజమ్మిల్ భట్(మరణానంతరం)కు కీర్తి చక్ర పురస్కారాలు దక్కాయి.

వీరికి శౌర్య చక్ర

శాంతికాలంలో ఇచ్చే మూడో అత్యున్నత శౌర్య పురస్కారమైన శౌర్య చక్ర పురస్కారం ఆర్మీకి సేవలు అందించిన కర్నల్ పవన్ సింగ్, మేజర్ సీపీఎస్ నిఖిల్, మేజర్ ఆశిష్ ధోన్‌ఛక్(మరణానంతరం), మేజర్ త్రిపాత్‌ప్రీత్ సింగ్, మేజర్ సాహిల్ రంధవా, సుబేదార్ సంజీవ్ సింగ్ జస్రోతియా, నాయబ్ సుబేదార్ పీ పబిన్ సింఘా, సిపాయి ప్రదీప్ సింగ్(మరణానంతరం), అబ్దుల్ లతీఫ్, నేవీకి చెందిన కెప్టెన్ శరద్ సిస్సువాల్, లెఫ్టినెంట్ కమాండర్ కపిల్ యాదవ్, ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన వింగ్ కమాండర్ వెర్నాన్ దెస్మాండ్ కేన్, స్క్వాడ్రన్ లీడర్ దీపక్ కుమార్, సీఆర్పీఎఫ్‌కు చెందిన పవన్ కుమార్(మరణానంతరం), సీ దేవన్(మరణానంతరం), లఖ్‌వీర్, రాజేశ్ పంచల్, మల్కిత్ సింగ్‌కు దక్కాయి.

ఉగ్రవాదులతో పోరులో మరణించిన మన్‌ప్రీత్ సింగ్

పంజాబ్‌కుచెందిన మన్‌ప్రీత్ సింగ్ 17 ఏండ్ల పాటు ఆర్మీలో సేవలందించారు. ఆయన తండ్రి కూడా ఆర్మీలో పని చేశారు. గత ఏడాది సెప్టెంబర్ 12న జమ్ము కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా కొకెర్‌నాగ్ ప్రాంతంలో ఉగ్రవాదులతో ఆయన వీరోచితంగా పోరాడి మరణించారు. ఇదే ఘటనలో మరణించిన హుమయున్ ముజమ్మిల్ భట్‌కు కూడా మరణాంతరం కీర్తి చక్ర దక్కింది.

1,037 మందికి పోలీస్ మెడల్స్

న్యూఢిల్లీ: కేంద్ర, రాష్ట్ర బలగాల్లో విశిష్ట సేవలందించిన 1,037 మంది పోలీసులకు ప్రభుత్వం బుధవారం సేవా పతకాలను ప్రకటించింది. అత్యున్నత రాష్ట్రపతి గ్యాలంటరీ పతకం (పీఎంజీ) ఈసారి తెలంగాణకు చెందిన హెడ్‌కానిస్టేబుల్ యాదయ్య దక్కించుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వీరికి ఈ పతకాలను అందజేస్తామని కేంద్ర హోం శాఖ తెలిపింది. రాష్ట్రపతి శౌర్య పతకం సహా 214 మందికి శౌర్య పతకాలు, 231 మందికి పరాక్రమ పతకాలు ప్రదానం చేస్తారు. మొత్తం పతకాల్లో 52 శౌర్య పతకాలు సీఆర్‌పీఎఫ్, 31 జమ్ము-కశ్మీర్ పోలీసు, యూపీ, మహారాష్ట్ర పోలీసులకు 17 చొప్పున, ఛత్తీస్‌గఢ్‌కు 15, మధ్యప్రదేశ్‌కు 12 పతకాలు లభించాయి. ఇక ఇతర వాటిల్లో 94 ప్రెసిడెంట్ పోలీస్ పతకాలు విశిష్ట సేవలకు, 729 పతకాలు ప్రశంసాపూర్వక సేవలు అందించిన వారికి లభించాయి.

ఆర్థిక సంస్కరణల కొత్త శకానికి పునాది

- *2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మార్చడమే లక్ష్యం*
- *స్వాతంత్ర్య దినోత్సవ సందేశంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము*

న్యూఢిల్లీ, ఆగస్టు 14: భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడమే లక్ష్యంగా ఆర్థిక సంస్కరణల కొత్త శకానికి పునాది పడిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. *78వ స్వాతంత్ర్య దినోత్సవం* సందర్భంగా బుధవారం ఆమె జాతినుద్దేశించి ప్రసంగించారు. ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదగడం గర్వించాల్సిన విషయమని, మొదటి మూడు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఎదిగే క్రమంలో దేశం ఉన్నట్టు పేర్కొన్నారు. *2047* నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఏఐ, సెమికండక్టర్లు, పటిష్టమైన బ్యాంకింగ్, ఆర్థిక రంగాలపై ప్రభుత్వం దృష్టిసారించిందని అన్నారు. సామాజిక న్యాయానికి ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యతను ఇస్తున్నదని, ఎస్సీ, ఎస్టీలు, ఇతర వెనుకబడిన సమాజాల సంక్షేమం కోసం అపారమైన చర్యలు తీసుకుంటున్నదని పేర్కొన్నారు. విభజిత ధోరణులను తిప్పికొట్టాలని ఆమె పిలుపునిచ్చారు. గత దశాబ్ద కాలంగా క్రీడా రంగంలో భారత్ అద్భుతంగా పురోగతి సాధించిందని ఆమె పేర్కొన్నారు. పారిస్ ఒలింపిక్స్‌లో భారతీయ క్రీడాకారుల ప్రదర్శనను, *టీ20* ప్రపంచ కప్‌లో టీమిండియా విజయాన్ని ఆమె ప్రస్తావించారు.

ఎర్రకోట వేడుకలకు ఒలింపిక్స్ బృందం

రాజధాని ఢిల్లీలో గురువారం జరిగే *78వ* స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఎర్రకోట సిద్ధమైంది. ఇటీవల పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత బృందం ఈ వేడుకల్లో పాల్గొంటున్నది. వీరే కాక అటల్ ఇన్నోవేషన్ మిషన్ (ఏఐఎం) విద్యార్థులు, బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్‌కు చెందిన కార్మికులు సహా మొత్తం *6,000* మంది ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేస్తున్నారు. వికసిత్ భారత్ *@2047* పేరిట నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో యువత, గిరిజనులు, మహిళలు, రైతులు ఇలా అన్ని వర్గాలకు చెందిన వారిని ప్రత్యేకంగా ఆహ్వానించారు. వీరేకాక మేరా యువభారత్ , ఎన్ఎస్ఎస్ పథకం కింద చేపట్టిన మేరీ మాటీ, మేరీ దేశ్ వాలంటీర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు కూడా పాల్గొంటారు.

ట్రైనీ డాక్టర్‌పై గ్యాంగ్ రేప్?

- ఆమె శరీరంలో అధిక మొత్తంలో వీర్యం
- పోస్టుమార్టం నివేదికలో వెల్లడి

ట్రైనీ డాక్టర్ హత్యాచారంపై హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానలో వైద్యుల నిరసన

కోల్‌కతా, ఆగస్టు 14: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటనలో మరో షాకింగ్ విషయం వెలుగులోకి వచ్చింది. ఆమెపై లైంగిక దాడి చేసింది ఒక్కరు కాదని, అది గ్యాంగ్ రేప్ అని పోస్టుమార్టం నివేదిక వెల్లడించిందని వైద్యులు చెబుతున్నారు. బాధితురాలి శరీరంలో అధిక మొత్తంలో 151 మిల్లీగ్రాముల వీర్యం ఉన్నట్టు తేలిందని డాక్టర్ సువర్ణ గోస్వామి తాజాగా ఓ జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఈ మేరకు బాధితురాలి తల్లిదండ్రులు కలకత్తా హైకోర్టులో వేసిన పిటిషన్‌లో వెల్లడించినట్టు కొన్ని మీడియా సంస్థలు కథనాలు ఇచ్చాయి. 151 ఎంజీ పరిమాణంలో వీర్యం అంటే ఒక్కరి నుంచి రాదని, లైంగిక దాడిలో పలువురి ప్రమేయం ఉన్నట్టు ఇది చెబుతున్నదని ఆఖిల భారత ప్రభుత్వ వైద్యుల సంఘం అదనపు ప్రధాన కార్యదర్శిగా కూడా ఉన్న డాక్టర్ గోస్వామి అన్నారు.

మా కుమార్తెపై జరిగింది గ్యాంగ్ రేప్..

తమ కుమార్తెపై సామూహిక లైంగిక దాడి జరిగిందని బాధితురాలి తల్లిదండ్రులు కలకత్తా హైకోర్టులో వేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. గొంతు పిసికి చంపడం వల్లనే తమ కుమార్తె మరణించినట్టు పోస్టుమార్టం నివేదిక వెల్లడించిందని తెలిపారు. తమ కుమార్తె సామూహిక లైంగిక దాడి, హత్యకు గురైనట్టు స్పష్టమైన ఆధారాలు కనిపిస్తున్నప్పటికీ ఇతర నిందితులను అరెస్టు చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. కాలేజీ ప్రిన్సిపాల్, ఇతర సంబంధిత వ్యక్తులను ఇప్పటి వరకు అదుపులోకి తీసుకోలేదని పేర్కొన్నారు.కాగా, ఈ ఘటనపై వస్తున్న విమర్శల మీద సీఎం మమతా బెనర్జీ స్పందించారు. సీబీఐకి పూర్తిగా సహకరిస్తున్నా కూడా ఆరోపణలు చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో బంగ్లాదేశ్ తరహా అల్లర్లు సృష్టించేందుకు బీజేపీ, సీపీఎం ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు.

సిల్చార్ కాలేజీ అడ్వైజరీపై విమర్శలు

బెంగాల్ ఘటన నేపథ్యంలో మహిళా సిబ్బంది, విద్యార్థినులకు అస్సాంలోని సిల్చార్ మెడికల్ కాలేజీ చేసిన సూచనలు విమర్శలకు కారణమయ్యాయి. నిర్మానుష్య, చీకటి ప్రదేశాలకు వెళ్లొద్దని, రాత్రి పూట హాస్టల్ బయటకు రావొద్దని, మర్యాదగా మాట్లాడాలని అడ్వైజరీ జారీ చేసింది. దీనిపై విమర్శలు రావడంతో వెనక్కు తీసుకుంది.

యూజీసీ నెట్ షెడ్యూల్‌లో మార్పు

26న జరగాల్సిన పరీక్ష 27కు వాయిదా: ఎన్టీఏ

న్యూఢిల్లీ, ఆగస్టు 14: ఈనెల 21 నుంచి మొదలవుతున్న యూజీసీ-నెట్ పరీక్షలకు సంబంధించి ఎన్టీఏ చిన్న మార్పు చేసింది. ఆగస్టు 26న 'కృష్ణ జన్మాష్టమి' వచ్చినందున, ఆ రోజు నిర్వహించాల్సిన పరీక్షను ఆగస్టు 27కు వాయిదా వేస్తున్నట్టు ఎన్టీఏ ప్రకటించింది. 'యూజీసీ-నెట్ జూన్ 2024 ఎగ్జామ్స్' షెడ్యూల్‌లో మిగతా పరీక్షలన్నీ ఇంతకు ముందు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయని పేర్కొన్నది.

కేంద్ర హోం శాఖ కార్యదర్శిగా గోవింద్ మోహన్

న్యూఢిల్లీ, ఆగస్టు 14: కేంద్ర హోం శాఖ తదుపరి కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి గోవింద్ మోహన్ నియమితులయ్యారు. మోహన్‌ను హోం మంత్రిత్వ శాఖలో తక్షణం ఓఎస్డీగా నియమించారు. ప్రస్తుతం హోం సెక్రటరీగా పనిచేస్తున్న అజయ్‌కుమార్ భల్లా పదవీకాలం ఈ నెల 22తో ముగుస్తుంది. తదుపరి ఆయన స్థానంలో మోహన్ బాధ్యతలు చేపడతారు.

ఐరాస శాశ్వత ప్రతినిధిగా పర్వతనేని హరీశ్

తెలుగు వ్యక్తికి కీలక పదవి

న్యూఢిల్లీ: న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి తదుపరి భారత శాశ్వత ప్రతినిధిగా తెలుగు వ్యక్తి పర్వతనేని హరీశ్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఆయన త్వరలోనే ఈ పదవిని చేపడతారని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ బుధవారం ప్రకటించింది. ఆయన 1990 బ్యాచ్ ఐఎఫ్ఎస్ అధికారి. ప్రస్తుతం జర్మనీకి భారత రాయబారిగా పని చేస్తున్నారు. జీ20, జీ7, బ్రిక్స్ సమావేశాల్లో కీలక పాత్ర పోషించారు. ఉప రాష్ట్రపతికి ఓఎస్డీగా కూడా పని చేశారు. రుచిర కాంభోజ్ జూన్‌లో పదవీ విరమణ చేయడంతో హరీశ్‌ను ఈ పదవిలో నియమించారు. రుచిర దాదాపు నాలుగు దశాబ్దాలపాటు దౌత్యవేత్తగా పని చేశారు. పర్వతనేని హరీశ్ హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తిచేశారు. గోల్డ్ మెడల్ కూడా పొందారు.

ఈడీ చీఫ్‌గా రాహుల్ నవీన్

న్యూఢిల్లీ: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తాత్కాలిక చీఫ్‌గా ఉన్న రాహుల్ నవీన్ పూర్తిస్థాయి డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు క్యాబినెట్ నియామకాల కమిటీ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 1993 బ్యాచ్ ఐఆర్ఎస్ అధికారి అయిన నవీన్ ఈడీ డైరెక్టర్‌గా రెండేండ్లు లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఏది ముందైతే అప్పటివరకు పదవిలో కొనసాగుతారు. 57 ఏండ్ల నవీన్ ఈడీలో 2019 నవంబర్‌లో ప్రత్యేక డైరెక్టర్‌గా నియమితులయ్యారు. గత ఏడాది సెప్టెంబర్ 15న నవీన్ తాత్కాలిక డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈయన హయాంలోనే ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, జార్ఖండ్ సీఎం హేమంత్ సొరేన్‌లను మనీ లాండరింగ్ కేసుల్లో ఈడీ అరెస్ట్ చేసింది.

కేంద్రం నుంచి పన్నులు వాపస్

- 2005 నుంచి చెల్లించాలని రాష్ట్రాలు అడగొచ్చు
- 12 ఏండ్ల పాటు విడతల వారీగా తీసుకోవచ్చు
- గనుల మీద రాయల్టీపై సుప్రీంకోర్టు కీలక తీర్పు
- సహజ వనరులు ఉన్న రాష్ట్రాలకు భారీ లబ్ధి

న్యూఢిల్లీ, ఆగస్టు 14: ఖనిజాలు, ఖనిజ నిల్వలు ఉన్న భూములపై 2005 ఏప్రిల్ 1 నుంచి కేంద్రం వసూలు చేసిన పన్నులు, రాయల్టీని వాపస్ చెల్లించమని రాష్ట్రాలు అడగొచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం కీలక తీర్పు వెలువరించింది. 2026 ఏప్రిల్ 1 నుంచి 12 ఏండ్ల పాటు విడతలవారీగా ఈ పన్ను బకాయిలను కేంద్ర ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థల నుంచి తిరిగి పొందొచ్చని రాష్ట్రాలకు అనుమతిచ్చింది. ఖనిజాలు, ఖనిజ వనరులు ఉన్న భూములపై రాయల్టీ, పన్ను విధించే చట్టబద్ధమైన అధికారం రాష్ట్రాలకు ఉందని జూలై 25న రాజ్యాంగ ధర్మాసనం 8:1 మెజారిటీతో తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. అంతకుముందు ఈ అధికారం కేంద్ర ప్రభుత్వానికే ఉందని 1989లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పక్కకుపెట్టింది. దీంతో తమ రాష్ట్రాల్లోని ఖనిజ వనరులపై 1989 నుంచి కేంద్రం తీసుకున్న రాయల్టీ, పన్నులను తిరిగి చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాల్సిందిగా పలు రాష్ట్రాలు సుప్రీంకోర్టును కోరాయి. కేంద్ర ప్రభుత్వం మాత్రం ఈ తీర్పు ఇచ్చిన జూలై 25 నుంచే అమలులోకి వచ్చేలా చూడాలని కోర్టును కోరింది.

రాష్ట్రాలకు భారీ ప్రయోజనం

గనులు, ఖనిజాలపై 1989 నుంచి వసూలైన రాయల్టీని తిరిగి రాష్ట్రాలకు చెల్లించాలనే వాదనను కేంద్రం వ్యతిరేకించింది. ఇలా చేస్తే ప్రజలు, ప్రభుత్వ రంగ సంస్థల(పీఎస్‌యూ)పై తీవ్ర ప్రభావం పడుతుందని వాదించింది. ప్రాథమిక అంచనాల ప్రకారమే పీఎస్‌యూలు రూ.70 వేల కోట్లు చెల్లించాల్సి ఉంటుందని, దీంతో పీఎస్‌యూల ఖజానా ఖాళీ అవుతుందని పేర్కొన్నది. దీంతో బుధవారం రాజ్యాంగ ధర్మాసనం ఈ విషయమై స్పష్టత ఇచ్చింది. 2005 ఏప్రిల్ 1 నుంచి గనులు, ఖనిజ వనరులపై కేంద్రం తీసుకున్న పన్నులను రాష్ట్రాలు తిరిగి పొందవచ్చని పేర్కొన్నది. కాగా, తొమ్మిది మంది సభ్యులతో కూడిన ధర్మాసనం ఇచ్చిన ఈ తీర్పుపై తనతో సహా ఎనిమిది మంది న్యాయమూర్తులు సంతకం చేస్తారని, జూలై 25న భిన్నమైన తీర్పు ఇచ్చిన జస్టిస్ నాగరత్న మాత్రం సంతకం చేయరని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ తెలిపారు. కాగా, సుప్రీంకోర్టు తాజా తీర్పుతో గనులు, ఖనిజ వనరులు ఉన్న రాష్ట్రాలకు భారీ మేలు జరగనుంది. ఇప్పటినుంచి వీటిపై పన్ను విధించే అధికారం రాష్ట్రాలకు రానుండటంతో పాటు గత 19 ఏండ్లుగా కేంద్రం వసూలు చేసిన పన్నులను కూడా తిరిగి పొందే అవకాశం రావడంతో భారీగా నిధులు అందనున్నాయి.

ఎస్బీఐ, పీఎన్‌బీతో కటీఫ్

ఖాతాలు మూసేయాలంటూ కర్ణాటక సర్కార్ ఉత్తర్వులు

బెంగళూరు: ప్రభుత్వ ఖాతాల్లో నిధుల దుర్వినియోగం ఆరోపణల నేపథ్యంలో, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ), పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లతో కర్ణాటక ప్రభుత్వం లావాదేవీలను నిలిపివేసింది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన వివిధ విభాగాలకు తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. ఆయా బ్యాంకుల్లోని తమ ఖాతాలను మూసేయటంతో పాటు, డిపాజిట్లను వెనక్కి తీసుకోవాలని, సెప్టెంబర్ 20 కల్లా ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించింది. 'ప్రభుత్వ విభాగాలు, ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, స్థానిక సంస్థలు, వర్సిటీలు, ఇతర విద్యా సంస్థలు ఎస్బీఐ, పీఎన్‌బీ బ్యాంకుల్లో ఖాతాలను రద్దు చేసుకోవాలి. కొత్తగా లావాదేవీలు, డిపాజిట్లు చేయరాదు' అని ఉత్తర్వుల్లో పేర్కొన్నది.

ఆర్మీ కెప్టెన్ వీరమరణం

- జమ్ముకశ్మీర్‌లో ఎదురుకాల్పులు
- ఉగ్రవాది హతం.. పౌరుడికి గాయాలు
- 4 నెలల్లో 20 మంది జవాన్ల మృతి

జమ్ము : జమ్ముకశ్మీర్‌లోని దోడా జిల్లాలో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక ఉగ్రవాది హతమయ్యాడు. ఉగ్రవాదుల ఎదురుకాల్పుల్లో ఆర్మీ కెప్టెన్ దీపక్ సింగ్ వీరమరణం పొందాడు. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు రోజు జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌లో ఒక పౌరుడికి కూడా గాయాలైనట్టు తెలుస్తున్నది. ఉగ్రవాదులు దాగి ఉన్నారన్న సమాచారంతో భద్రతా బలగాలు దోడాలోని శివఘడ్-అస్సార్ బెల్ట్ అటవీ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. తొలుత నలుగురు మరణించినట్టు భావించినప్పటికీ ఒక్క ఉగ్రవాదే హతమైనట్టు అధికారులు నిర్ధారించారు.

అదనపు డీజీపీ ఆనంద్ జైన్ మాట్లాడుతూ ఆపరేషన్ కొనసాగుతున్నదని చెప్పారు. ఆర్మీ కెప్టెన్ మృతి పట్ల సంతాపం ప్రకటించారు. ఉదంపూర్-దోడా-కిష్త్వార్ రీజియన్‌లో ఇటీవల కాలంలో ఇది నాలుగో ఎన్‌కౌంటర్. గత నాలుగు నెలల్లో జమ్ముకశ్మీర్‌లో ఉగ్రదాడుల్లో సుమారు 20 మంది జవాన్లు ప్రాణాలు కోల్పోయారు.

అయోధ్యలో 50 లక్షల విలువైన లైట్లు చోరీ

అయోధ్య: అత్యంత కట్టుదిట్టమైన భద్రత కలిగిన అయోధ్యలో భారీ చోరీ జరిగింది. రామ మందిరానికి దారితీసే భక్తిపథ్, రామ్‌పథ్ మార్గాల్లో ఏర్పాటు చేసిన లైట్లను దొంగలు ఎత్తుకెళ్లారు. వీటి విలువ రూ. 50 లక్షల పైమాటే. రామ మందిర నిర్మాణం అనంతరం భక్తిపథ్, రామ్‌పథ్‌లో వెదురు లైట్లు, ప్రొజెక్టర్ లైట్లు ఏర్పాటు చేసి అందంగా తీర్చిదిద్దారు. ఇప్పుడు వీటిలో 3800 వెదురు లైట్లు, 36 ప్రొజెక్టర్ లైట్లు చోరీకి గురయ్యాయి. ఈ నెల 9నే ఈ ఘటన జరిగింది. తాజాగా వెలుగులోకి వచ్చింది. రామ్‌పథ్‌లో మొత్తం 6400 వెదురు లైట్లు, భక్తిపథ్‌లో 96 ప్రొజెక్టర్ లైట్లు ఏర్పాటు చేశారు. మార్చి 19 వరకు అన్నీ ఉన్నాయి. మే 9న చేసిన తనిఖీల్లో కొన్ని లైట్లు అదృశ్యమైనట్టు గుర్తించారు. ఇప్పటి వరకు మొత్తం 3,800 వెదురు లైట్లు, 36 ప్రొజెక్టర్ లైట్లను దొంగలు ఎత్తుకెళ్లినట్టు గుర్తించారు. ఆలయ ప్రతినిధుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

600 నుంచి 60 కిలోలకు

స్వల్ప కాలంలోనే 542 కిలోలు తగ్గిన సౌదీ అరేబియన్

న్యూఢిల్లీ, ఆగస్టు 14: సుమారు *610* కిలోల బరువుతో ప్రపంచంలోనే అత్యంత బరువైన వ్యక్తిగా గుర్తింపు పొందిన సౌదీ అరేబియాకు చెందిన ఖలీద్ బిన్ మోహసేన్ షరీ బరువు ఇప్పుడు *63.5* కేజీలు. అత్యంత భారీ కాయంతో బరువు కారణంగా మూడేండ్లకు పైగా ఖలీద్ మంచానికే పరిమితమయ్యాడు. అతని ఆరోగ్యం రోజురోజుకు క్షీణించడం, వైద్యానికి ఖర్చు ఎక్కువ కావడంతో దానిని భరించలేక పోయాడు. ఈ క్రమంలో అతడి పరిస్థితిపై సౌదీ అరేబియా మాజీ రాజు అబ్దుల్లా స్పందించి అతనికి వైద్య సహాయాన్ని అందించారు. నిపుణులైన *30* మంది వైద్యులను ఏర్పాటు చేశారు. వారి పర్యవేక్షణలో డైట్ నిబంధనలతో పాటు పలు సర్జరీలు చేయడంతో ఆరు నెలల్లోనే తన బరువును సగానికి తగ్గించుకున్నాడు. *2023* నాటికి అతని బరువు *542* కేజీలు తగ్గి *63.5*కిలోలకు తగ్గడంతో ఇప్పుడు చలాకీగా తన పనులు చేసుకుంటున్నాడు.

జుట్టు కత్తిరించుకోండి

యుద్ధంతో నీళ్లు, సబ్బులకు తీవ్ర కొరత

గాజాలో అమ్మాయిలకు దయనీయ పరిస్థితి

గాజా, ఆగస్టు 14: ఇజ్రాయిల్ - పాలస్తీనా మధ్య గత పది నెలలుగా కొనసాగుతున్న యుద్ధంతో పాలస్తీనాలోని గాజాలో తీవ్ర సంక్షోభ పరిస్థితులు తలెత్తాయి. గాజాకు రవాణా వ్యవస్థలను ఇజ్రాయిల్ బలగాలు స్తంభింపజేయడంతో గాజాలో అన్ని వస్తువులకు కొరత ఏర్పడింది. ఇక్కడి ప్రజలకు కనీస అవసరాలు కూడా అందడం లేదు. నీళ్ల కొరత వేధిస్తున్నది. చెత్త సేకరణ, మురుగు శుద్ధి సరిగ్గా జరగడం లేదు. శాంపూలు, సబ్బులు, దువ్వెనలు, రుతుక్రమం సమయంలో అవసరమయ్యే వస్తువులు సైతం లేక అమ్మాయిలు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో జబ్బులు, ఇన్ఫెక్షన్ల బారిన పడే ప్రమాదం ఉందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దువ్వెనలు కూడా లేకపోతే గాజాలోని ఆడపిల్లలు జుట్టు కత్తిరించుకోవాలని పీడియాట్రిషియన్ డాక్టర్ లోబ్నా అల్ అజ్జెజా సూచించారు. శిబిరాల్లో నివసిస్తున్న ప్రజలకు దద్దుర్లు, ఫంగల్ ఇన్ఫెక్షన్లు వస్తున్నట్టు ఆమె తెలిపారు.

ఉక్రెయిన్ అదుపులో 100 మంది రష్యా సైనికులు!

కీవ్, ఆగస్టు 14: తమ బలగాలు రష్యాలోని కుర్స్క్ ప్రాంతంలో మరింత ముందుకు చొచ్చుకెళ్తున్నాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ బుధవారం తెలిపారు. ఉక్రెయిన్ మిలిటరీ చీఫ్ ఒలెక్సాండ్ర్ సైర్స్కీతో ఆయన వీడియో కాల్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్ బలగాలు రష్యా సరిహద్దు దాటిన తర్వాత కిలోమీటరు నుంచి రెండు కిలోమీటర్ల వరకు రష్యాలోకి తమ బలగాలు ప్రవేశించాయని తెలిపారు. *100* మంది రష్యా సైనికులు తమ అదుపులో ఉన్నారని, ఇది తమ పిల్లలు తిరిగి ఉక్రెయిన్ చేరుకునేందుకు అవకాశం కల్పిస్తుందని తెలిపారు. రష్యాలోని *74* నివాస ప్రాంతాలు తమ ఆధీనంలోకి వచ్చినట్టు ప్రకటించారు.

భారతీయులకు అడ్వైజరీ

రష్యా ఆధీనంలో ఉన్న ప్రాంతాలకు ఉక్రెయిన్ బలగాలు చేరాయనే వార్తల నేపథ్యంలో రష్యాలో ఉన్న భారతీయులకు భారత రాయబార కార్యాలయం అడ్వైజరీ జారీ చేసింది. బ్రయాన్స్క్, బెల్గొరొడ్, కుర్స్క్ ప్రాంతాల్లో నివసించే భారతీయులు ఇటీవలి భద్రతా సంఘటనల దృష్ట్యా తాత్కాలికంగా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించింది.

కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ నిరాకరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 14: ఢిల్లీ సీఎం, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టులో నిరాశ ఎదురైంది. ఢిల్లీ మద్యం పాలసీపై సీబీఐ నమోదు చేసిన కేసులో మధ్యంతర బెయిల్ మంజూరు చేసేందుకు న్యాయస్థానం బుధవారం తిరస్కరించింది. మరోవైపు తన అరెస్టును సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై స్పందన తెలియజేయాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం సీబీఐని ఆదేశించింది.

అయోధ్య రాముని విగ్రహ శిల్పికి అమెరికా వీసా తిరస్కరణ

న్యూఢిల్లీ: అయోధ్య ఆలయంలోని బాలక్ రామ్ విగ్రహ శిల్పి అరుణ్ యోగిరాజ్‌కు వీసాను అమెరికా నిరాకరించినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నెల 30 నుంచి వచ్చే నెల 1 వరకు వర్జీనియాలో జరిగే ప్రపంచ కన్నడ మహా సభలకు ఆయన హాజరుకావలసి ఉంది. ఇటీవల ఆయనకు ప్రపంచ గుర్తింపు లభించిన నేపథ